# విశ్వరూపం

"మీరు రెండు మూడేళ్లు ఒంగోలులో వుండివచ్చారుటగదండీ?"

ఫెన్సింగ్ దగ్గర మల్లె పందిరి చుట్టూరా తిరుగుతూ, మల్లెపూలు కోస్తున్న నేను ఉలికిపడి, తలతిప్పి చూశాను. మా ఎదురింట్లో అద్దెకు వుంటున్న (యు. డి. సి.) సత్యనారాయణ భార్య.... ఈ మధ్య కొత్తగా కాపురానికి వచ్చిన మీనాక్షి నావేపే చూస్తోంది. ఆ ప్రశ్న ఆ అమ్మాయే వేసిందని అర్థమయింది.

మేం అద్దెకు వుంటున్న ఇళ్ళు కట్టిన "ఓనరు"గారు బహుశా క్రితం జన్మలోనో, పోయిన యుగంలోనో, ఇంజనీరో, బొమ్మల డిజైన్ ఆఫీసరో అయ్యుంటారు. అంచేత, ఒకే ఆవరణలో, ముక్కోణాకారంలో మూడు "కాటేజి"ల్లాటి ఇళ్ళు, అన్ని సదుపాయాలతో ముచ్చటగా కట్టించారు. ఒకే కాంపౌండులో వున్నా, ఏ ఇల్లుకా ఇల్లు విడివిడిగా వుండటమూ, ప్రతి ఇంటి చుట్టూరా ఫెన్సింగ్, చిన్నగేట్లు, వాకిట్లోకి వస్తేతప్ప, మిగతా రెండు ఇళ్ళ వాళ్ళూ కనిపించనంతటి, వారి మాటలు వినిపించనంతటి దూరం వుండేలా, చాకచక్యంగా కట్టించాడు. టౌనుకు బాగా దూరమే అయినా, రిక్షా ఛార్జీలు ఎక్కువే అయినా, ధారాళంగా గాలీ వెలుతురూ, టౌన్ రద్దీలేని ప్రశాంత వాతావరణం కోరుకొనే వారికి చాలా సౌకర్యంగా వున్నాయి ఇవి!

సత్యనారాయణ వుండే ఇల్లు సరిగ్గా మా ఇంటికి ఎదురుగా వుంది. మూడో కోణంలో వుండే ఇంట్లో డాక్టర్ నీరజ వుంటోంది. నీరజ తల్లి దండ్రులు బాగా వున్నవారు. ఏదో పల్లెటూరిలో మోతుబరి రైతులు. ఒక్కర్తే కూతురు కావటంవల్ల నీరజ ఆడింది ఆట పాడింది పాటగా

పెరిగి, పట్టుబట్టి మెడిసిన్ చదివింది. తనిష్టమొచ్చినప్పుడు పెళ్ళిచేసుకుంటా ననీ, ఇప్పట్లో పెళ్ళి సంబంధాలు చూడవద్దనీ, మారాంచేసి, టౌన్‌లో ప్రాక్టీసు పెట్టింది. డబ్బు ఎక్కువగా వచ్చినా రాకున్నా, కోరినంత డబ్బు ఇంటి నుంచి తెప్పించుకుంటుంది. తమ కూతురు "గొప్ప డాక్టరు" అన్న గర్వం ఆ తల్లిదండ్రుల కుంటుందిట. తరచూ నీరజ కాంపౌండు బయట ఆగిన రిక్షా దిగి వస్తూనో, రిక్షాలో కూర్చోవటానికి వెడుతూనో, ఓ పది నిముషాలు మా ఇంటి ముందు ఆగి పై ముచ్చటలన్నీ చెబు తుంటుంది. స్నేహశీలి. ఓ లేడీ డాక్టర్ నాకు "ఫ్రెండ్" అన్న గర్వం కించిత్తు నాకూ వుంది.

ఇక సత్యనారాయణ చాలా బిడియంగల మనిషి. ఎప్పుడో మా శ్రీవారితో రెండు ముక్కలు మాట్లాడుతాడు. లేకుంటే అదీ లేదు. అతగాడి పెళ్ళై ఇంకా మూడు నెలలు నిండలేదు.

మీనాక్షి పుట్టిల్లు నెల్లూరు జిల్లాలో ఏదో పల్లెటూరట. ఐదోక్లాసు వరకూ చదువుకుందట. (ఆ వివరాలు మీనాక్షి నిక్కడ దిగబెట్టటానికి వచ్చిన వాళ్ళ అమ్మమ్మ చెప్పింది. "వెర్రి పిల్ల! ఏమీ తెలీదు. కాస్త పెద్ద దిక్కుగా, తెలియనివి చెప్పండి!" అని నాతో మరీ మరీ చెప్పి, నాకో పెద్దరికపు బాధ్యతను కూడా అప్పగించింది) మీనాక్షి అలంకరణ చాలా మోటుగా వుంటుంది. కళ్ళు వెళ్లుకువచ్చేలా గట్టిగా బిగదీసి, బోడిగా దువ్వివేసిన జడ చివర జడ గంటలు, నెత్తిమీద నాగరం, రెండు ముక్కులకూ ఎర్ర రాళ్ళ ముక్కు పుడకలూ, చెవులకు తెల్లరాళ్ళ ముద్ద కమ్మలూ, పెద్దపెద్దజూకాలూ, భుజాలకుతగులుతూ, కుచ్చిళ్ల అస్తవ్యస్తంగా పెట్టి కట్టిన ముదురురంగు ఇమిటేషన్ సిల్కుచీరె....వీటితో మీనాక్షిలోని సహజ సౌందర్యం బుగ్గిపాలై పోయింది!

"మా ఆయన చెప్పారు! మీరు ఒంగోలులో రెండు మూడేళ్ళు వుండి వచ్చారని!"

మళ్ళీ మీనాక్షి అనటంతో నా ఆలోచనలు చెల్లాచెదరై పోయాయి. "అప్పుడు మూడేళ్లు వున్నాం. తర్వాత మా వారి కిక్కడికి ట్రాన్స్ఫరయింది!" అన్నాను మాటలు కలుపుతూ.

"మీకు ఒంగోలులో రోజా, రాజా, మంగపతి, హుసేను, హనుమాయమ్మ తెలుసా?" అంది జడగంటలు సరిగా ముడివేసుకుంటూ.

ఒంగోలులో మూడేళ్ళున్నాం, మా శ్రీవారు పెద్ద ఆఫీసరు కాబట్టి, ఏదేనా ముఖ్యమైన సభలకూ సమావేశాలకూ, నేనూ వారితోబాటు వెళ్తూనే వుండేదాన్ని. మీనాక్షి చెబుతున్న వాళ్ళెవరో ప్రముఖులే అయ్యుండాలి. ఆ వ్యక్తులెవరో తెలియక పోగా, కనీసం వారి పేర్లు కూడా వినివుండక పోవటం నా తెలివి తక్కువతనంగాక మరేమిటి? వాళ్ళెవరో నాకు తెలియదని, తెలిసినట్లు బుకాయించటమూ నావల్ల కాదు....అందుకే సిగ్గు పడుతూ, "తెలీదు!" అన్నాను.

"అయ్యో! తెలీదూ!" అంది మీనాక్షి నొచ్చుకొంటూ....ఒంగోలు జిల్లాలో ప్రకాశం పంతులుగారు పుట్టారన్న సంగతేనా తెలియని వాళ్లుంటారేమోగానీ, పై ప్రముఖుల్ని గురించి తెలియని వాళ్ళుంటారా అన్నట్లు ధ్వనించిందా ఒక్క మాటా!

"మీకు బాగా తెలుసా? మీకు స్నేహితులా? లేక బంధువులా?" అన్నాను. కనీసం ఇప్పుడేనా తెలుసుకోవటం మంచిదన్న వుద్దేశ్యంతో.

"ఊహూఁ! నాకూ తెలియదండీ! ఇందాక రేడియోలో "అప్పిస్తావా? చస్తావా?" చిత్రంలో "నన్నే నన్నే పెళ్ళాడు...నువ్వే నువ్వే నీళ్ళాడు" అనే పాట కావాలని ఒంగోలు నుంచి రోజా, రాజా, మంగపతి, హుసేను, హనుమాయమ్మ కోరారని చెప్పాడు! మీరు ఒంగోల్లో వుండి వచ్చారని మొన్న ఒకరోజు మా ఆయన చెప్పారు.

అందుకని....మీకేమైనా వాళ్ళు తెలుసునేమోనని అడిగాను...." అంటూనే పూలచెండు తెచ్చుకోవటానికి కాబోలు లోపలికి పరుగెత్తింది.

నా చేతిలోని మల్లెపూలు వేసివున్న స్టీలు పూలబుట్ట జారి క్రింద పడింది. మూర్ఛవచ్చినంత పనైంది. లోపల్నుంచి నవ్వు కెరటాల్లా ఎగసిరావటం మొదలెట్టింది. అంతలోనే జాలి ముంచుక వచ్చింది. ఇంతటి అమాయకురాలు ఈ నగర జీవితంలో ఎలా నెగ్గుకువస్తుంది ? ఆరువేలరూపాయల కట్నానికి ఆశపడి మీనాక్షిని పెళ్లాడిన సత్యనారాయణ, భార్యారత్నం ప్రసంగం కనుక వినివుంటే, అరక్షణంలో ప్రాణాలు వదిలే వాడేమో ! పాపం ! మీనాక్షికి కనీస జ్ఞానం కొంత నేర్పాలి.

ఆ మర్నాటి నుంచీ, మధ్యాహ్నం వేళప్పుడు, శ్రీవారు, సత్యనారాయణ, ఇళ్ళల్లో లేని సమయాలలో మీనాక్షిని మా ఇంటి కాహ్వానించటం మొదలెట్టాను. నేను ఎంబ్రాయిడరీ చేసిన టేబిల్ క్లాత్స్, అల్లిన లేసులూ, తలగడల గలేబులమీద వేసిన ఫాబ్రిక్ పెయింట్స్ వగైరాలు చూపెడుతూ కబుర్లలోకి దింపేదాన్ని.

"ఎంచక్కా ఇవన్నీ చేస్తారక్కయ్యా !" అంటూ బుగ్గలు నొక్కుకొనేది ముదినాపసానిలా ! మెల్లిగా మీనాక్షికి ఒక్కొక్కటిగా నచ్చచెప్పటం మొదలెట్టాను.

"జడ కాస్తంత వదులుగా వేసుకో. నాగరం ఇప్పుడెవరూ పెట్టు కోవటం లేదు. కావలిస్తే ఒక ముక్కుకి ఒక సన్నని ముక్కుపుడక పెట్టుకో. అసలు లేకున్నా కొంపలు మునిగిపోవు. భుజాలు తగులుతూ, నీ తలకంటే ఎక్కువగా గడియారం "పెండ్యులం"లా వూగుతున్న ఆ పొడుగుపాటి జూకాలు తీసెయ్. ఈ కమ్మలు మార్పించి కొత్త ఫ్యాషన్ లేవేనా పెట్టుకో. లేతరంగు చీరెలూ, మంచి వాయిల్సూ కట్టుకో. అన్నిటికంటే ముఖ్యమైనది, ప్రతి చిన్న విషయానికి ఆశ్చర్యపోవద్దు.

ఆశ్చర్యం కలిగినా, మాటమాటకూ దవడలు నొప్పెట్టేలా బుగ్గలు నొక్కుకోకు...."

రెండు నెలలు తిరిగే సరికి మీనాక్షి అలంకరణలో, మాట తీరులో మంచి మార్పు వచ్చింది. కాళ్ళ పట్టీలు తీసివేసింది. మెడలో మోకుల్లా వున్న బంగారు గొలుసులన్నీ దాచేసి, ఒక్కసరుడు, నల్లపూసల గొలుసూ మాత్రం వేసుకొంటోంది. "చందమామ", "బొమ్మరిల్లు", "బాలమిత్ర"ల స్థాయిదాటి, చిన్న చిన్న నవలలూ, నవలికలూ, వార పత్రికలలోని కథలూ—ఆ అమ్మాయి భావనాశక్తికి అందేవిగా నేను ఏరి ఇస్తుంటే, చదువుతోంది. ఇప్పుడిప్పుడే చదివిన పుస్తకాల మీద బాగోగులు చర్చిస్తోంది కూడాను.

"మీకు తన కృతజ్ఞతలు చెప్పమన్నారు లలితక్కయ్యా మా శ్రీవారు। నాలో చక్కటి మార్పు తీసుకొచ్చారట।" అందో రోజు మీనాక్షి, నాజూకుగా.

నాకు సంతోషమూ, సంతృప్తి కలిగాయి.

వారం రోజులపాటు సత్యనారాయణకు విడవకుండా జ్వరం రావటం మొదలెట్టింది. అది టైఫాయిడ్ క్రిందికి దించుతుందేమోనన్న అనుమానం కలిగింది నాకూ, మా శ్రీవారికి. డాక్టర్ నీరజతో నాకున్న పరిచయాన్ని పురస్కరించుకుని సత్యనారాయణకు ట్రీట్‌మెంటు ఇవ్వవలసిందిగా కోరాను. నీరజ నవ్వింది. "ఒక్క కాంపౌండ్‌లో వున్నాం. మీరింతగా చెప్పాలా?" అంటూ ఆ రోజునుంచే ట్రీట్‌మెంటు ప్రారంభించింది. సత్యనారాయణ జ్వరతీవ్రతలో పలవరిస్తుంటే, బేజారెత్తిపోయిన మీనాక్షికి ధైర్యం చెబుతూ, నేనూ శ్రీవారు రోజులో ఎక్కువ భాగం వాళ్ళింట్లోనే గడపవలసి వచ్చింది. నీరజకూడా అంతే. పదిహేనురోజులలో సత్యనారాయణ కోలుకున్నాడు. సత్యనారాయణ జబ్బు మూడీళ్ళ

వాళ్ళనూ, ఒక్క కుటుంబంలో మనుషులుగా మార్చివేసింది. పండుగ రోజుల్లో పిండివంటలు అంది పుచ్చుకోవటాలూ, నీరజను భోజనానికి ఆహ్వానించటం, సినిమాలకు అప్పుడప్పుడు కలిసి వెళ్ళటాలూ మామూలై పోయాయి. నీరజకు తోడుగా ఒక్క నౌకరు కుర్రాడు, ఓ పనిమనిషి (వంటా, ఇంటి పనీ చూచుకోవటానికి) తప్ప మరెవరూ లేరు.

రెండు నెలలు తిరిగేసరికి, మరో కొత్త మార్పు పసిగట్టాను. నీరజ నాతో కంటే ఎక్కువగా, మీనాక్షితో స్నేహంగా వుంటోంది. వీలు చిక్కినప్పుడల్లా ఉదయం, సాయంత్రం మీనాక్షితో కబుర్లాడుతోంది. తరచూ అక్కడే ఏదో ఓ సాకుతో "డిన్నర్" ఏర్పాటవుతోంది. సత్యనారాయణ, మీనాక్షి, నీరజ....నాకు మాట మాత్రమేనా చెప్పకుండా సినిమాలకు వెళ్తున్నారు. మొదట్లో ఎవరితోనూ మాట్లాడని సత్యనారాయణ సరదాగా,హుషారుగా, నీరజతో కబుర్లుసాగిస్తున్నాడు. నీరజ రాకపోకలలో ఓ (పెర్మినెంటు!) పేషెంటును పరామర్శిస్తున్న ధోరణిగానీ, సత్యనారాయణ కబుర్లలో, కళ్ల చికిలింపులలో, పెదవుల వొంపులలో, ఓ లేడీడాక్టరుతో తన "అనారోగ్య" విషయమై చర్చిస్తున్న వైనంగానీ, కాగడావేసి చూచినా కనిపించటంలేదు. మొన్ననో రోజురాత్రి—శ్రీవారేదో క్యాంపుకువెళ్లారు....తోచక,మల్లెపందిరి దగ్గరనిల్చుని, పిండారబోసినట్లున్న వెన్నెలకేసిచూస్తున్నాను....సరిగా అప్పుడే, తన ఇంటినుంచి బయల్దేరిన నీరజ....ఆమెకోసమే కాచుకుని వున్నట్లు ఫెన్సింగ్ దగ్గర నిల్చునివున్న సత్యనారాయణదగ్గరగావచ్చి, నవ్వుతూ ఏదో సన్నగాచెబుతోంది. అతగాడి చెయ్యి సుతారంగా ఆమె చేతిని నొక్కుతోంది! నాకు శరీరమంతా జలదరించినట్లయ్యింది. నాకు కొన్నాళ్లుగా మసకమసకగా వున్న అనుమానానికి ఋజువు దొరికినట్లయ్యింది.

ఇలాటివి నగర జీవితాలలో, నాగరిక మనుష్యులలో కోకొల్లలే

నాడు....కానీ కళ్ళెదురుగా మీనాక్షిలాటి అమాయకురాలికి ద్రోహం జరగటం నేను సహించలేననిపించింది.

ఆ క్షణంలోనే ఇంట్లోనుంచి మీనాక్షి బయటికి వచ్చింది. సత్యనారాయణ, నీరజలు తగినంత దూరం జరిగారు.

"ఓ! నీరజక్కయ్యా! నువ్వా! నీ కోసం కబురుపెడదామను కుంటున్నాను. ఈ రోజు శనివారం కదూ? కారం సమోసాలు చేశాను. రా! రా! ఒక్కటి రుచిచూచి పోదువుగానీ!" అంది చేటంత మొహం చేసుకుని. ముగ్గురూ ఇంట్లోకి వెళ్ళిపోయారు.

మీనాక్షి అమాయకత్వం వీళ్ళిద్దరికీ మాంచి అవకాశం ఇస్తోంది. మీనాక్షికీ సంగతి ఎలా తెలియజెప్పటం? ఇలాటి "డెలికేట్" విషయాలు దంపతులకు "మూడో మనిషి" ద్వారా తెలియటం మంచిదికాదు. అది చిన్న కాపురంలో కలతలు సృష్టించటమే అవుతుంది. మీనాక్షి తనంత తానుగా ఎలా తెలుసుకుంటుంది?

అదే ఆలోచన! అదే ఆందోళన. నీరజపట్ల అదివరకున్న స్నేహ భావమూ, గౌరవమూ మాయమై జుగుప్స చోటుచేసుకుంది నాలో! నీరజ ఇలాటి వెకిలి వేషాలు వేయకుంటే,లక్షణంగా ఎవరినేనా పెళ్లాడకూడదూ? సత్యనారాయణ మన్మధుడేం కాడు. గొప్ప ధనవంతుడుగానీ, పెద్ద ఆఫీసరుగానీ కాడు. మీనాక్షిలాటి అమాయకురాలి భర్త! మగాడు. అతగాడికి ఆ ఆలోచన లేకపోయినా, ఈ నీరజకెలా లేకపోయింది?

నేను ముభావంగా వుండటంతో, నీరజకూడా నన్ను పలకరించటం తగ్గించేసింది బాగా! అసలా కాంపౌండులో మూడో ఇల్లున్న సంగతే వాళ్లు మరచిపోయారల్లే వుంది. "నీరజక్కయ్య, నీరజక్కయ్య" అంటూ మీనాక్షి మురిసిపోతూ తన పుట్టిములగబోతున్న సంగతి తెలుసుకోవటం లేదు. మీనాక్షి అమ్మమ్మకు ఆరోగ్యం సరిగా లేదనీ, మీనాక్షిని చూడాలని

కలవరిస్తోందనీ, ఉత్తరం రావటంతో, మీనాక్షిని వెంటబెట్టుక వెళ్ళి, ఆమె పుట్టింట్లో దిగబెట్టివచ్చాడు సత్యనారాయణ.

ఇక నీరజ, సత్యనారాయణలకు పట్టపగ్గాలు లేవు. డిస్పెన్సరీకి ఆటవిడుపుగా వెళ్ళివస్తోంది నీరజ. డాక్టర్ సర్టిఫికేటుతో ఈయనగారు సెలవుపెట్టాడల్లే వుంది ఆఫీసుకు. అదేమంటే జ్వరం, గుండెనొప్పి, మరేదో మాయజబ్బు! ఈవిడగారి ట్రీట్‌మెంటు! సినిమాలు, పేకార్లు, ఇంట్లో కబుర్లూ....

"మీనాక్షీ! వెర్రిపీనుగా! త్వరగా రా! నీ కాపురం చక్కదిద్దుకో! ఈ రాక్షసి నీ బ్రతుకు బండలు చేసేలా వుంది! ఆనక నీకు ఏడవటానికి కూడా ఏమీ మిగలదు!" ఇలా రాత్రింబవళ్ళు నా మనస్సు ఘోషిస్తోంది. మీనాక్షికి సంగతులన్నీ ఉత్తరంవ్రాసే ధైర్యమూలేదు.

పదిరోజుల తర్వాత, ఆ రోజు సాయంత్రం .... మీనాక్షి హఠాత్తుగా వూరినుంచి వచ్చింది. ఇంట్లో సత్యనారాయణ "గుండె నొప్పితో" బాధపడ్తుండే నీరజ "వైద్యం" చేస్తోందల్లేవుంది....

చేస్తున్న పని వదలి మా ఇంటి ఫెన్సింగ్ దగ్గరే తచ్చాడుతూ నిల్చున్నాను. మీనాక్షి పల్లెటూరి పిల్ల, అమాయకురాలూ అయినా, ఏ దృశ్యాలెలాటివో పోల్చుకోలేనంతటి అమాయకురాలు కాదు. అందునా పల్లెటూరి రకం కాబట్టి—ఏ విషయంలోనూ ముసుగులూ, నాజూకులూ తెలియని మనిషి! నీరజను....చేతికందిన వస్తువుతో నాలుగు తగిలించ వచ్చు.. సత్యనారాయణను దులిపేయవచ్చు....

ఆ ఊహ తాలూకు దృశ్యం చూడటానికీ, వినటానికీ వెయ్యికళ్లూ, వెయ్యిచెవులూ చేసుక నిల్చుని వున్నాను. కానీ, మీనాక్షి ఇంట్లోకి వెళ్ళాక ఓ పదిహేను నిమిషాలపాటు ఏదో చిన్నసైజు వాగ్యుద్ధం సత్యనారాయణతో జరిగినట్లుందేగానీ, గిన్నెలూ, గరిటెలూ వగైరాలేవీ

బయటకు గిరవాటు వేయబడలేదు. కాస్సేపయ్యాక నీరజ మాత్రం ముఖం చిన్నబుచ్చుకుని, తన ఇంటికేసి వెళ్ళింది.

మర్నాడు మధ్యాహ్నం మా ఇంటికి వచ్చిన మీనాక్షిని, వుండ బట్టలేక అడిగాను. "నిన్న నువ్వు ఊరినుంచి రాగానే....ఏదో గొడవైనట్లుందే! గాలివాటు ఇటు కదా. అరుపులు వినిపిస్తేనూ...."

మీనాక్షి తేలిగ్గా నవ్వేసింది "ఏం లేదక్కయ్యా! పది రోజులు నేనింట్లో లేకపోతే ఇల్లెలా తయారుచేశారో తెలుసా మీ మరది! ఏమూల చెత్తాచెదారం ఆ మూల! చివరకు మంచి పాంటు....మా వాళ్ళిచ్చింది.... మూలపారేస్తే,ఎలుకలుకొట్టేశాయి! మరి నాకు కోపంవచ్చిందంటే,రాదూ?"

నా చేతిలో వున్న స్టీలు పటకారుతో మీనాక్షి బుర్రమీద ఒక్కటిచ్చుకుందా మనిపించింది! ఇక ఇది పనిగాదనుకుని, నవనాగరిక ప్రపంచంలో కొందరు స్త్రీ పురుషులు ఎలా విచ్చలవిడితనం అలవర్చుకొంటున్నదీ, కథలుగా చెప్పాను. నాకు తెలిసిన ఓ అమాయకురాలైన ఇల్లాలికి, మరో అవివాహిత .... ఉద్యోగిని అయిన స్త్రీవల్ల ఎంతటి అన్యాయం జరిగిందీ, దాంపత్య జీవితంలో నిప్పులు వెదజల్లబడిందీ, నీరజ సత్యనారాయణల పేర్లు మార్చి, ఉద్యోగాలు మార్చి, ఉనికిమార్చి, కథగా చెప్పాను. ఇంకా పుస్తకాలలో కథలు ఉదహరించాను.

చివరగా కర్తవ్యం బోధిస్తూ "మీవారి ఆరోగ్యం ఇప్పుడు భేషుగ్గా వుంది. మీకో ఫామిలీ డాక్టర్ అనవసరం! ఆవిడ రోజూ రావటం ఎందుకు? చూచేవాళ్ళకూ్కడా బావుండదు. సువ్వావిడతో స్నేహం తగ్గించు....మీ ఉద్యోగమేదో, మీ సంసారమేదో మీరు చూచుకోండి!" అన్నాను. మీనాక్షి తలూపి వెళ్ళిపోయింది. బహూశా గీతోపదేశం చేశాక, విశ్వరూపం చూపిన కృష్ణుడు కూడా ఆ సమయంలో నాలా ఇంత అయాసపడి వుండదేమో!

మీనాక్షి కథ ఓ కొలిక్కి రాకముందే, ఆ సాయంత్రమే మాకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ రావటమూ, నాలుగు రోజుల్లోనే మేము సామాను సర్దేసి బయల్దేరటమూ జరిగి పోయింది .... చాలా మార్లు తీరిక వేళల్లో మీనాక్షి జీవితం ఎలాటి మలుపు తిరిగిందోనన్న ఆలోచన నన్ను వేధిస్తూనే వుండేది. తర్వాత తర్వాత మర్చిపోయాను....అదంతా జరిగి సుమారు ఆరేళ్ళు దాటింది కూడాను.

* * * * *

సినిమా హాల్లో ఇంటర్వెల్‌లో లైట్లు వెలిగాయి. శ్రీవారు సిగరెట్ వెలిగించుకోవటానికేమో, బయటకు వెళ్ళారు....

"ఓ ! లలితక్కయ్యా ! మీరా !" అన్న గొంతుక దగ్గర్లో విని, వెనక్కు మెడ తిప్పాను.

బన్‌వేసి గోపురంలా చుట్టిన సిగతో, జపాన్ జార్జెట్‌మీద జరీ పువ్వులు కుట్టిన చీరెలో, మెడలో రవ్వల నెక్లెస్, రవ్వలదుద్దులు .... రవ్వల గాజులు....ధగధగ మెరిసిపోతుంటే, పలకరింపుగా నవ్వుతూ మీనాక్షి కనిపించింది. వెనక "రో"లో ! చప్పున గుర్తు రాలేదుగానీ మెల్లగా పోల్చుకున్నాను.

"నేనేలెండి లలితక్కయ్యా ! మీనాక్షిని. మీరిక్కడే వున్నారని తెలుసుగానీ అడ్రసు తెలియదు నాకు.... మేమిక్కడికి వచ్చి రెండు నెలలు కావొస్తోంది....రేపు మధ్యాహ్నం కారు పంపిస్తాను .... మా ఇంటికి తప్పక రావాలి మీరు....సావకాశంగా మాట్లాడుకుందాం!'' అంది మీనాక్షి. మా ఇంటి నెంబరు, వీధి వగైరా వివరాలు కనుక్కుని.... తిరిగి పిక్చర్ ప్రారంభం కావటంతో మా సంభాషణ "కట్" అయింది. ఆలోచన తెగలేదు....మీనాక్షి ఐశ్వర్యం ఓ మిస్టరీలా వుంది ! పిక్చర్ పూర్తి అయ్యీ కాకముందే మీనాక్షి బయటకు వెళ్ళిందల్లే వుంది. మేం బయటకు వచ్చేసరికి ఆమె కారు కదిలి వెళ్తోంది.

చెప్పినట్లుగానే మర్నాడు మధ్యాహ్నం మీనాక్షి కారు పంపించింది నాకోసం. మీనాక్షివాళ్ల బంగళా చూసేసరికి నా కళ్లు బైర్లుకమ్మినట్లయింది. అధునాతనమైన ఫర్నిచర్‌తో అందమైన పెద్ద బంగళా. సత్యనారాయణ "బిజినెస్" పనిమీద ఎక్కడికో క్యాంపుకు వెళ్లాడట. త్వరలోనే లక్షరూపాయల పైచిలుకుమీద ఈ బంగళా కొనబోతున్నారట !

ఇద్దరు పిల్లలు .... రబ్బరు బొమ్మల్లా వున్నారు. ఇల్లంతా చూపించాక బెడ్‌రూమ్‌లోకి తీసికెళ్లింది. ఫోమ్‌బెడ్స్, డన్‌లప్ పిల్లోస్.... చాలా నీట్‌గా, గొప్పగా వుంది.... చిన్న ఫ్రిజ్ కూడా వుందక్కడే.

ఫ్రిజ్ తలుపు తీసింది. తాజా పళ్లతోబాటు, విస్కీబాటిల్స్ కూడా వున్నాయి. అనుమానంగా మీనాక్షి వేపు చూశాను.

"ఓ ! అవా ! ఎప్పుడేనా శ్రీవారు కొద్దిగా పుచ్చుకుంటారు. తప్పనిసరైతే నేనూను ! ఏంచేస్తాం అక్కయ్యా ! మోడరన్ డేస్‌లో ఇలాటివి తప్పవు .... తప్పూ కావనుకో !" అంది యాపిల్‌పండు సుతారంగా స్టీలుకత్తితో చెక్కుతీస్తూ. నేను ఆశ్చర్యంగా చూస్తూ కూర్చున్నాను. కాస్సేపు నాలో ఏవేవో ప్రశ్నలు సుళ్లతిరుగుతున్నాయి.

"నీరజ ఎలా వుంది ?" అన్నాను. నా కళ్లలో, మనసులో వున్న ప్రశ్నలు పసిగట్టిందల్లే వుంది. మీనాక్షి సిగమీది మువ్వలూ, ముత్యాలూ గలగలలాడేలా నవ్వింది.

"మీరు చాలా భయపడిన నీరజ .... ఈ మధ్యే పెళ్లాడింది ఆమె. ఆమె భర్తా డాక్టరేలెండి. మొన్నను నేనూ, మా శ్రీవారూ, ఏర్‌పోర్ట్‌కు వెళ్లి వీడ్కోలిచ్చాం లెండి .... ఫారిన్ వెళ్లిపోయారు .... ఇంగ్లీషు ధారాళంగా మాట్లాడుతున్నానని ఆశ్చర్యంగా వుందా ? ఓ ఆంగ్లో ఇండియన్ లేడీ ట్యూటర్ని పెట్టుకున్నాను. 'టాకింగ్ లెసన్స్' చెబుతోంది...." నాముందు ఆపిల్ ముక్కలున్న ప్లేటు జరిపి, బెడ్‌మీద

విలాసంగా కూర్చుంది మీనాక్షి .... ఆమె ఇంగ్లీషు మాట్లాడుతున్నందుకు కాదు నా కాశ్చర్యం .... నీరజ సంగతి....

"నీరజను దూరంగా వుంచమని .... ఆమె స్నేహం ప్రమాదకర మైందనీ హెచ్చరిస్తూ, మీరు పరోక్షంగా చెప్పిన కథ సారాంశం నాకానాడు బోధపడక పోలేదు.... మీక్కోపం రాదంటే ఓ విషయం చెబుతాను !"

"చెప్పు !" అన్నాను. నా ఎదురుగా నేనెరిగిన మీనాక్షి గాక, మరెవరో వున్నట్లనిపిస్తోంది. ఈ మీనాక్షి నాకంటే వయసు లోనూ, అనుభవంలోనూ కూడా చాలా పెద్దదానిలా అనిపిస్తోందేమిటో !

"ఆనాడు మీ సలహా పాటించి, నీరజను దూరం చేసుకొనివుంటే, మేమీనాడు.... ఈనాడేకాదు.... మరేనాడూ, కలలోకూడా ఇలాటి స్థితిలో వుండగలిగే వాళ్ళం కాదు !" అంది. నేను గతుక్కుమన్నాను. నేను మీనాక్షి మేలుకోరి ఆనాడా సలహా ఇచ్చానని ఈ క్షణంలోనూ మనస్ఫూర్తిగా చెప్పగలను.

"లలితక్కయ్యా ! నీరజకూ మా శ్రీవారికీ మధ్య ఏర్పడిన ఆకర్షణ....నేను మొదట్లోనే పసిగట్టాను....అది బలపడటానికే నేను మా వూళ్ళో పదిరోజులుండి వచ్చాను....నే నూరినుంచి వచ్చిన రోజు మీరు విన్న వాగ్యుద్ధం....నేను వాళ్ళిద్దరి ఆకర్షణ అలా కొనసాగేందుకు అంగీకరించటానికి నేను పెట్టిన షరతుల తాలూకుది !

"మా శ్రీవారు పరువుకూ, నా నోటికీ, భయపడే పిరికివారని నాకు తెలుసు. నీరజ ఏనాడూ భార్యకాలేదు .. నా స్థానాన్ని కదిలించలేదు. కారణం సంఘపు సానుభూతీ, అండదండలూ నా కున్నాయేగానీ ! ఆమెకు లేవు .. అదామెకూ తెలుసు ! ఓ పెద్ద లేడీ డాక్టరు .... ఆఫ్టరాల్ ఓ గుమాస్తాతో ....ఇలా .... పిచ్చిబట్టి పోతోందంటే, వినేవాళ్ళు నవ్వుతారనీ

ఆమెకు తెలుసు. అయితే, కొంతకాలం "అన్ మారీడ్"గా వుండ దల్చు కుందేగానీ, టొత్తిగా "కన్య"గా వుండాలను కోలేదావిడ ! పది మందికీ తెలియకుండా "స్నేహం" అనే ముసుగులో, నా రక్షణలో....రోజులు వెళ్ళబుచ్చుకోవాలనుకుంది. అవన్నీ నాకు తెలుసు...."

ఆపిల్ ముక్క మింగుడు పడలేదు. నా ఎదురుగా బెడ్ మీద కుదురుగా కూర్చునివున్న మీనాక్షికి రెండు తలలూ, నాలుగుచేతులూ, ఆరు కాళ్ళూ....వున్నట్లూ కొత్త "విశ్వరూప" మేదో చూస్తున్నట్లూ అనిపిస్తోంది.

"నీరజ బంగారు పిచ్చుక. ఆమె కోరినంత డబ్బు, ఆమె తలితండ్రులు లామెకిస్తారు. రెండు చేతులా సంపాదిస్తోంది కూడాను. నా షరతుమీద, పాతికవేలు నర్సింగ్ హోంలో సామగ్రి కొనటానికని తెప్పించింది నీరజ. శ్రీవారు ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశారు. సంవత్సరం తిరిగే సరికి పాతికవేలూ బిజినెస్‌లో "రోల్" అయి రెట్టింపయింది. బిజినెస్‌లో సులుపు బలువులన్నీ తెలుసుకున్నారు వారు.

"నీరజకు లేని సిగ్గూ, భయమూ నాకేమిటి ? నా తెలివి తేటల ద్వారా తన పరువు బజారున పడకుండా, అటు నీరజా – ఇటు డబ్బూ సంపాదించుకో గలిగిన శ్రీవారికి నేను సాక్షాత్తూ దేవతను !....ఈజన్మలో కలలో కూడా పొందని ఐశ్వర్యం, అదృష్టం సాధించుకున్నాను....శ్రీవారి చిన్న చిన్న ఆకర్షణ లంటారా !....అవి మైనర్ థింగ్స్ ! ప్రపంచంలో డబ్బుంటే ఏదీ తప్పుకాదు. డబ్బులేని వాళ్లు చేసినవే తప్పులుగానూ, అవినీతిగానూ....బయటికి వస్తాయి.

"డబ్బులేని వాళ్ళు తప్పు చేస్తే అది తప్పు. డబ్బున్న వాళ్లు అదే తప్పుచేస్తే అది నాగరికత,

"అంతే! ఐశ్వర్యం పెరిగేకొద్దీ, బిజినెస్ పెరిగేకొద్దీ, శ్రీవారికి నీరజ మీద మోజు దానంతటదే తగ్గింది. నీరజకూ అంతే. పెళ్ళి, మొగుడూ, ఓ కుదురూ, కుండా అవసరమనిపించాయి! ఓ ఫారిన్‌రిటర్న్‌డ్ డాక్టర్ని పెళ్ళాడింది. ఇదరూ కలిసి ఫారిన్‌కు వెళ్లారు.

"ఎన్నో మార్లు మీరు గుర్తొచ్చేవారు! మీరు నా గురించి ఎంతగా ఆందోళన పడిందీ తల్చుకుంటే మీ మీద ఎంతో అభిమానంతోబాటు జాలి కలిగేది. అయితే ఇవన్నీ అప్పట్లో మీకు చెప్పాలనిపించలేదు. చెబితే కోప్పడేవారేమో!"

నాకు తల తిరిగినట్లయింది.... పొలమారింది.... నన్ను నేను సర్దుకోవటానికి చాలా సేపు పట్టింది.

ఇంటికి వచ్చాక కూడా మీనాక్షి విశ్వరూపం నా కళ్ళెదుటే కనిపిస్తోంది.

రేడియోలో "సత్తెనపల్లినుంచి.... అమ్మణ్ణి, అలివేలు, గోపాలం.... అంటూ ఏవేవో ఊళ్ళ పేర్లతో పాటలు కోరిన శ్రోతల పేర్లు వినిపించినపుడల్లా.... ఒకనాడు.... మొదటిసారిగా నన్ను పరిచయం చేసుకుంటూ....

"ఒంగోలు రోజా, రాజా, మంగపతి, హుసేన్, హనుమాయమ్మ తెలుసా మీకు?" అంటూ అడిగిన మీనాక్షి గుర్తుకు వస్తుంది. అంతలోనే ఆ మీనాక్షి బదులుగా—మరో మీనాక్షి.... నా కంటే చాలా ఎత్తుగా పెరిగి (మానసికంగా) నన్ను చూచి జాలిపడే మీనాక్షి కనిపిస్తుంది! ఈ విశ్వరూపంలో వెనుకటి మీనాక్షి ఏనాడో కరిగిపోయింది.

('జ్యోతి' దీపావళి ప్రత్యేక సంచిక 1972)